క్లుప్తంగా

అభినందనలు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని తులసీనగర్‌లోని జీవన్‌జ్యోతి హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షల్లో 10/10 జీపీఏ సాధించిన నలుగురు విద్యార్థులను కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ సోమవారం స్వీట్స్ తినిపించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అత్యుత్తమ ఫలితాలు సాధించిన జీవనజ్యోతి స్కూల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, మహిళా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మీ, జీవన్‌జ్యోతి స్కూల్ ప్రిన్సిపల్ రాజశేఖర్, లూయిస్, పోశెట్టి గౌడ్, విద్యార్థులు గణేష్, రత్నాకర్, రాకేష్, శిరీష పాల్గొన్నారు.

22నుంచి ఆలయ బ్రహ్మోత్సవాలు

మూసాపేట: భరత్‌నగర్‌కాలనీలోని హరిహర క్షేత్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ 14వ వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆంజనేయులు తెలిపారు. ఈనెల 22 నుంచి 29 వరకు ఉత్సవాలు జరుగుతాయని అన్నారు. 27వ తేదీ ఉదయం 10 గంటలకు శ్రీవారి కల్యాణం, సాయంత్రం 5.30 గంటలకు స్వామివారి ఊరేగింపు ఉంటుందని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

అక్రమ పార్కింగ్ సమస్యను పరిష్కరిస్తాం



పూల్‌బాగ్‌కాలనీ, సత్తిరెడ్డి కాలనీవాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ రవీందర్‌రెడ్డి

బాలానగర్: ప్రజల వద్దకే వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నామని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని పూల్‌బాగ్ కాలనీ, సత్తిరెడ్డి కాలనీలో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా పూల్‌బాగ్ కాలనీవాసులు అక్రమ పార్కింగ్ వల్ల ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కారిస్తానని తెలిపారు.

స్పోర్ట్స్ కిట్లు అందజేత

కేపీహెచ్‌బీకాలనీ: కేపీహెచ్‌బీ డివిజన్ 7వ ఫేజ్ సమ్మర్ క్యాంప్ మైదానం వద్ద సోమవారం క్రీడాకారులకు కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు స్పోర్ట్స్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కృష్ణారావు నాయకత్వంలో డివిజన్‌లోని క్రీడాకారులను ప్రోత్సహించేందుకు వారికి అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు. ఇండోర్ షటిల్ కోర్టులు, పార్కులు, వాకింగ్ ట్రాక్స్, స్విమ్మింగ్‌పూల్స్‌ను నిర్మించుకున్నామని తెలిపారు. కూకట్‌పల్లి నియోజకవర్గంలో ఎంతో మంది అంతర్జాతీయ క్రీడల్లో నిలవడం మనకెంతో గర్వకారణం అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అంజిబాబు, ప్రతాప్, వెంకటరమణ, వెంకటేశ్వరరావు, అప్పారావు, లక్ష్మీనారాయణ, విశ్వనాథం, శ్రీనివాస్, చైతన్య పాల్గొన్నారు.

గౌతమ్‌నగర్‌లో 85శాతం పనులు పూర్తి చేశాం




సమస్యల పరిష్కారానికి గౌతమ్‌నగర్‌లో పాదయాత్ర చేసిన కార్పొరేటర్ సతీష్‌గౌడ్

బాలానగర్: ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేపట్టానని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని గౌతమ్‌నగర్‌లో చేపట్టిన పాదయాత్రలో డివిజన్‌లో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంచారు. స్టిక్కర్స్‌ను పంపిణీ చేశారు. గౌతమ్‌నగర్‌లో 85 శాతం అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయని అన్నారు. కార్యక్మంలో అధికారులు ఏఈ పవన్, అశోక్, సాయి, శ్యామ్, పార్టీ నాయకులు దత్తారావు, శశి, భాగయ్య, అఫ్జల్, శేఖర్, సురేందర్ నాయుడు, మల్లిక్ తదితరులు పాల్గొన్నారు.

డా. అందె సుధాకర్‌కు బంగారు నంది అవార్డు

ఓల్డ్ బోయిన్‌పల్లి: సామాజిక సేవలో ముందుంటూ చారిటీని నడుపుతున్న పారా మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ అందె సుధాకర్ బంగారు నంది అవార్డు అందుకున్నారు. మదర్స్ డే సందర్భంగా జీసీఎస్ వల్లూరి గ్రూప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జీసీఎస్ వల్లూరి గ్రూపు ఫౌండర్, నేషనల్ చైర్మన్ వీఆర్ శ్రీనివాస్‌రాజు చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఇలాంటి అవార్డుల ద్వారా మరింత బాధ్యత పెరుగుతుందన్నారు.



డా.అందె సుధాకర్‌ను అవార్డుతో సత్కరిస్తున్న జీసీఎస్ వల్లూరి గ్రూప్ ప్రతినిధులు

ప్రజా సేవకే అంకితమయ్యాను..

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు
- ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని అభ్యర్థన



లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్

ఓల్డ్ బోయిన్‌పల్లి: మీలో ఒకడిగా ఉంటూ ప్రజా సేవకే అంకితమయ్యానని.. నా బలగం మీరేనని.. రాబోయే ఎన్నికల్లో ఆశీర్వదించి అక్కున చేర్చుకోవాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. నిరంతరం కూకట్‌పల్లి నియోజకవర్గం అభివృద్ధికి పాటు పడుతూ ఇంటికి పెద్ద కొడుకులా పని చేస్తున్న తనకు అండగా ఉంటున్న ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు.

◆ సోమవారం ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రజలు ఆత్మగౌరవంతో బతుకుతున్నారని అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం ఒకప్పుడు సమస్యల వలయంలో కొట్టు మిట్టాడుతూ ఉండేదన్నారు. ఇప్పుడు ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. నిధుల కొరత లేకుండా ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని చేసిన విషయం అందరికీ తెలిసిందేనని గుర్తు చేశారు.

◆ అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేను ప్రజలు పెద్ద కొడుకుల చూసుకుంటూ ఆదరిస్తూ ఉన్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఆయనను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌లో 69 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను అందించడం గొప్ప విషయమని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు నరేందర్‌గౌడ్, కాత్రె జంగయ్య, సయ్యద్ ఏజాజ్, ఇర్ఫాన్, మేకల హరినాథ్, గడ్డం నర్సింగ్‌రావు, బుర్రి యాదగిరి, లలితా, వేణుగోపాల్‌రెడ్డి, మన్నె ఉదయ్‌యాదవ్, మల్లేష్‌యాదవ్, ఉదయ్, మట్టి శ్రీను, సిరాజ్, జాంగీర్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేటర్ ముద్దం ఏర్పాటు చేసిన భోజన కార్యక్రమంలో లబ్ధిదారులు

తీర్మానాలపై ఏటీఆర్‌ను సమర్పించాలి



కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో పాల్గొన్న జెడ్‌సీ మమత

- కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మమత
- వివిధ శాఖల అధికారులతో సమీక్ష

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో సోమవారం జోనల్ కమిషనర్ వి.మమత వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వివిధ విభాగాలకు ఇతర శాఖలతో ముడిపడి ఉన్న సమస్యలపై చర్చించారు. ఇంతకు ముందు సమావేశంలో చర్చించిన విషయాలు, వాటిపై తీసుకున్న చర్యలపై సమీక్ష జరిపారు. వచ్చే సమావేశం నుంచి వివిధ శాఖల అధికారులందరూ ప్రస్తుతం జరిగే సమావేశ తీర్మానాలపై ఏటీఆర్‌ను సమర్పించాలని కోరారు.

◆ ముందుగా ట్రాఫిక్ పోలీసులు మాట్లాడుతూ.. జేఎన్‌టీయూ నుంచి మంజీరా మాల్ వరకు రోడ్డు డివైడర్‌పైన ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేయాలని కోరారు. దీంతో ప్రమాదాలు అరికట్టవచ్చని అన్నారు. సర్కిళ్ల వారీగా ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలను వారానికి రెండు రోజులు విధిగా తొలగించాలని పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు.

◆ బాలానగర్ తహసీల్దార్ కార్యాలయం నుంచి చింతల్ వైపు గ్రీనరీ ఏర్పాటు చేయాలని యూజీడీ అధికారులను ఆదేశించారు. సిగ్నల్స్ దగ్గర పెరిగిన చెట్ల కొమ్మలను తొలగించాలని కోరారు. రోడ్డు మధ్యలో ఉనన విద్యుత్‌స్తంభాలను తొలగించాని కోరారు. ఆల్వాల్ పరిధిలో ఖానాజీగూడా రోడ్డు విస్తరణ అవసరముందని తెలిపారు. ప్రశాంత్‌నగర్‌లో వర్షపునీరు నిల్వకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ హెచ్‌ఎండబ్ల్యూఎస్ వారు ఇతర శాఖలతో ఉన్న సమస్యలపై మాట్లాడుతూ.. వారికి రోడ్డు కటింగ్ అనుమతులపై చర్చించారు. అందులో రాబోయే వర్షాకాలం దృష్ట్యా రోడ్డు కటింగ్ అనుమతులు లేవని తెలియజేశారు. ఈ సమావేశంలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండబ్ల్యూ అండ్ ఎస్‌ఎస్‌బీ, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్, సీఆర్‌ఎంపీ ఏజెన్సీ, ఇతర శాఖల అధికారులు హాజరయ్యారు.

ఓటర్ల ఇంటింటి సర్వేకు శ్రీకారం

కుత్బుల్లాపూర్: నియోజకవర్గంలో ఓటర్ల ఇంటింటి సర్వే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో 549 పోలింగ్ కేంద్రాల్లో 6,17,441 మంది ఓటర్లు నమోదు కాగా వీరిలో పురుషులు 3,24,910 మంది మహిళలు 2,92,406 మంది ఇతరులు 125 ఉన్నారు. అందుకు సంబంధించిన బూత్ లెవెల్ అధికారులతో సోమవారం అధికారులు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సంబంధిత పోలింగ్ కేంద్రాల వారీగా ఓటర్ లిస్టు తీసుకుని ఇంటింటికీ వెళ్లి అదనంగా ఓట్లు ఉంటే వారిని తొలగించాలని, లేదా ఇతర ప్రాంతాలకు వెళ్లినట్లు గుర్తిస్తే సంబంధిత ఇంటి యజమానితో దరఖాస్తు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ మంగతాయారు, దుండిగల్ తహసీల్దార్ పద్మప్రియ, జంట సర్కిళ్ల అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు వెంకటేష్, శ్రీనివాసరావు, సూపరిడెంట్ గిరిబాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా పొలిటికల్ పార్టీలతో సమావేశం కాగా జయరాం (బీఆర్ఎస్), తులసి (టీడీపీ), అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అసలైన లబ్ధిదారుల స్థలాలనే క్రమబద్ధీకరించాలి

నిజాంపేట్: ప్రభుత్వ ఖాళీ స్థలాలపై జీఓ.58, 59 ద్వారా దరఖాస్తు చేసుకున్న వాటిపై సమగ్ర విచారణ చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. సోమవారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ సర్వే నంబర్లలోని ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసుకునేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. అసలైన లబ్ధిదారుల స్థలాలనే క్రమబద్ధీకరించాలన్నారు. నిజాంపేట్ బీజేపీ అధ్యక్షుడు ఆకుల సతీష్ ఆధ్వర్యంలో కూన శ్రీశైలంగౌడ్ నిజాంపేట్‌లో సోమవారం పర్యటించారు.

◆ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొమ్మిదేళ్లుగా పేదలకు ఇళ్లు ఇవ్వలేని ప్రభుత్వం.. కబ్జాలు జరుగుతుంటే మాత్రం చూసీచూడనట్లుగా వ్యవహరిస్తోందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాలను ప్రజావసరాలకు ఉపయోగించాలని కోరారు. సుమారు 1000 వరకు ఈ జీవో ద్వారా దరఖాస్తు చేసినట్లు తెలుస్తోందన్నారు. అర్హులందరికీ క్రమబద్ధీకరణ ద్వారా మేలు చేయాలని కోరారు. అదే రకంగా అనర్హులు ఖాళీ స్థలాలపై దరఖాస్తు చేసుకుంటే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చారిచారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ కో–కన్వీనర్ డాక్టర్ రాజు, ప్రధాన కార్యదర్శి భిక్షపతియాదవ్, రంపకాశి, కొంకి రాము, భూపాల్‌రెడ్డి, మాధవరావు, ఈశ్వర్‌రెడ్డి, రాజు, మురళీకృష్ణ, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట్‌లో పర్యటించి ప్రభుత్వ ఖాళీ స్థలాలను పరిశీలిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

కలసికట్టుగా బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలి


జగద్గిరిగుట్ట: బాలలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్లాన్ ఇంటర్నేషనల్, జాగృతి ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో బాల కార్మిక వ్యవస్థ, బాలల హక్కులపై అవగాహన కల్పించడం హర్షణీయమని జగద్గిరిగుట్ట కార్పొరేటర్ జగన్ అన్నారు. సోమవారం మగ్దూంనగర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ అవగాహన కార్యక్రమాలతో బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బాలలతో భిక్షాటన, శారీరక మానసిక వేధింపులు, బాలల పట్ల వివక్ష, లైంగిక వేధింపులు చాలా వరకు అరికట్టవచ్చన్నారు. అందరం కలసికట్టుగా బాల కార్మిక వ్యవస్థను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు మేరీ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఆధార్‌కార్డ్ క్యాంప్ ప్రారంభం..

జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్పలో సోమవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆధార్‌కార్డ్ క్యాంప్‌ను కార్పొరేటర్ జగన్ ప్రారంభించారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ క్యాంపును అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆధార్‌కార్డ్ అధికారి రామకృష్ణ,అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భాగ్యమ్మ, సామాజిక కార్యకర్త యాకన్న, బీఆర్ఎస్ ఆర్‌జీకే అధ్యక్షుడు సంతోష్ కుమార్, భూపతిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, జరీనా, అరుణ, తులసి, ఈశ్వరమ్మ, జిలానీ తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే సీఎం కప్ పోటీలు

దుండిగల్: క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్రీడా పోటీలను నిర్వహిస్తోందని దుండిగల్ మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలను ఈ నెల 15వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహించనున్నారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో పోటీలను ప్రారంభించారు. 15 నుంచి 36 సంవత్సరాల వయస్సు గల వారు అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పురుషులు, మహిళల విభాగాల్లో తలపడనున్నారు. మండల స్థాయిలో గెలుపొందిన వారిని జిల్లా, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేస్తారని కమిషనర్ తెలిపారు.



వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

రూ.6500 కాజేశాడని స్నేహితుడినే చంపేశాడు

హత్య మిస్టరీని చేధించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు

కుత్బుల్లాపూర్: మద్యం మత్తులో మృతి చెందిన ఓ వ్యక్తి హత్య కేసు మిస్టరీని పేట్‌బషీరాబాద్ పోలీసుల చేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అయోధ్యనగర్‌కు చెందిన సాయికిరణ్ (23), సుభాష్‌నగర్‌కు చెందిన గణేష్ (34) కొంత కాలంగా ఎక్కడ పని దొరికితే అక్కడ పని చేసుకుంటూ వచ్చిన డబ్బులతో తాగి జల్సాలకు అలవాటు పడ్డారు. ఈనెల 9వ తేదీన మద్యం సేవించిన ఇద్దరు సుభాష్‌నగర్‌లో నిద్రించారు.

◆ ఈ క్రమంలో నిద్రిస్తున్న సమయంలో గణేష్ జేబులో నుంచి సాయికిరణ్ రూ.6500 కాజేశారు. దీనిని మనసులో పెట్టుకున్న గణేష్ కక్ష పెంచుకున్నారు. ఈనెల 11వ తేదీన సుభాష్‌నగర్‌లోని సర్వే నం.13లోని ఇసుక కుప్పలపై తాగి నిద్రిస్తున్న సాయికిరణ్‌ను తీవ్రంగా గాయపరిచి హత్య చేసి ఆపై ఏమీ తెలియనట్లు అక్కడ నుంచి జారుకున్నాడు. కేసు దర్యాప్తు చేపట్టిన పోలీసులు కొంత కాలంగా గణేష్, సాయికిరణ్‌లు కలిసి పని చేస్తున్నట్లు తెలుసుకున్నారు. పలు ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించగా హత్య జరిగిన రోజు ఇద్దరు కలిసి ఉన్నట్లు గుర్తించారు. దీంతో గణేష్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా అసలు విషయం బయట పడింది. నిందితుడు గణేష్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రివైజ్డ్ ఓటర్ లిస్టను అందుబాటులో ఉంచాలి

రంగారెడ్డినగర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన రివైజ్డ్ ఓటర్ లిస్టను ప్రజలకు అందుబాటులో ఉంచాలని బీఆర్ఎస్ నాయకుడు కె.జయరామ్ సోమవారం ఎన్నికల అధికారి మంగతాయారుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కుత్బుల్లాపూర్ అసెంబ్లీ ఓటర్ల లిస్ట్‌లో అవకతవకలు ఉండటంతో తమ ఓటు ఏ ప్రాంతంలోని ఏ బూత్‌లో ఉందో తెలియక ఇబ్బందులు పడుతన్నామని అన్నారు. గతంలో ఓటింగ్ శాతం తగ్గడంలో ఇదే ప్రధాన కారణమని తెలిపారు. ఈసారైనా ఓటర్ లిస్ట్‌లో తప్పులను సరి చేసి ఓటర్లకు రివైజ్డ్ లిస్టను అందుబాటులో ఉంచి ఓటింగ్ శాతం పెరిగేలా చూడాలని కోరారు. దీనిపై మంగతాయారు సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

21వ వార్డులో నేటి నుంచి కంటి వెలుగు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి 21వ వార్డులో ఈనెల 16 నుంచి 29 వరకు కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభమవుతుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. సాయినగర్‌లోని బస్తీ దవాఖానాలో ఈకార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే కంటి వెలుగు శిబిరంలో ప్రజలు పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. పరీక్షలకు వచ్చే వారు తప్పనిసరిగా ఆధార్‌కార్డును తీసుకురావాలని కోరారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

జగద్గిరిగుట్ట: శ్రీ వైష్ణవి దుర్గా శ్రీచక్ర ఉపదేవతల విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన మహోత్సవాలను జగద్గిరిగుట్టలోని మగ్దూంనగర్‌లో ఈనెల16 నుంచి 10 రోజుల పాటు నిర్వహించనున్నట్లు శ్రీజయగురు నవదుర్గా సేవా సమితి తెలిపారు. ఈ పూజలను ఉడుపి కొక్కే సుబ్రమణ్యమఠాధీశులైన శ్రీవిద్యాప్రసన్నతీర్థ స్వామి నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తాం

టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి

కుత్బుల్లాపూర్: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రైవేట్ కంపెనీల్లో 75 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రంలో భాగంగా సోమవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రామరాజునగర్‌లో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా మోసం చేశాయని ఆరోపించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్ పార్టీకి ఈ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రవణ్‌కుమార్, నాయకులు శ్రీనివాస్, సంపత్‌గౌడ్, రాజు, జేమ్స్, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తాగుడికి బానిసై వ్యక్తి ఆత్మహత్య



మృతుడు మహేష్

బాలానగర్: తాగుడికి బానిసైన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రానగర్‌లో సైదమ్మ, నాగన్న దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నాడు. నాగన్న కుమారుడు అయిన మహేష్(28) భార్యతో విడాకులు తీసుకొని తల్లిదండ్రుల వద్దనే ఉంటున్నాడు. మద్యానికి బానిసైన మహేష్ ఉదయం ఇంట్లో ఉరి వేసుకొని చనిపోయాడు. తండ్రి నాగన్న ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇళ్లను కాపాడాలని సొసైటీ సభ్యుల ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: బహదూర్‌పల్లిలో 40 ఏళ్ల కిందట ప్లాట్లు కొనుగోలు చేసి ఇళ్లు నిర్మించుకున్న తమ స్థలాలను ప్రభుత్వ భూములని రెవెన్యూ అధికారులు జులూం చేస్తున్నారని సోమవారం కలెక్టరేట్ వద్ద బహదూర్‌పల్లి సాయినాథ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు ధర్నా నిర్వహించారు. తమ సొసైటీ ఇళ్లను కాపాడటంతోపాటు ప్రభుత్వ భూములు అంటూ జులూం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం డీఆర్‌ఓ లింగ్యానాయక్‌కు వారు వినతి పత్రం అందజేశారు. సొసైటీ సభ్యుల ఆందోళనకు టీపీసీసీ నేత హరివర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ కార్యకర్తలు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ధర్నాలో వారు భాగస్వామ్యాన్ని పంచుకున్నారు.

పర్యావరణంలో జీవితాన్ని కొనసాగించాలి

జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి ఒక్కరూ పర్యావరణంలో వారి జీవితాన్ని కొనసాగించాలని, అందుకు పర్యావరణహిత జీవనశైలిపై అవగాహన ఎంతో అవసరమని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ ప్రజావాణి సమావేశ మందిరంలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణహిత జీవనశైలిపై జిల్లా అధికారులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అవసరమైన చర్యలను ప్రభుత్వం చేపడుతోందన్నారు. ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని కోరారు. మనం తీసుకునే నీటి నుంచి మొదలుకొని అన్నింటిలోనూ పర్యావరణానికి హాని కలిగించేవి ఉన్నాయని, ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. దుమ్ము, ధూళి, పొగ వంటి విషయాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ హిత జీవన శైలి వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో దేవసహాయం, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, కాలుష్య నియంత్రణ మండలి బోర్డు అధికారి రాజేంద్రన్, వివిధ శాఖల జిల్లా శాఖల అధికారులు పాల్గొన్నారు.

పాలిసెట్‌కు ఏర్పాట్లు పూర్తి

మేడ్చల్: ఈ నెల 17న నిర్వహించే పాలిసెట్ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు గిర్మాపూర్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సెట్ కన్వీనర్ స్నేహలత తెలిపారు. పరీక్షల కోసం మేడ్చల్‌లో 9 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయగా వాటిలో 2,520 మంది పరీక్షలు రాయనున్నారని తెలిపారు. పరీక్షలకు ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 1.30గంటల వరకు ఉంటుందని చెప్పారు. నిమిషం ఆలస్యమైనా అనుమతి ఉండదని, విద్యార్థులంతా సకాలంలో పరీక్షా కేంద్రాలకు హాజరుకావాలని కోరారు.

ప్రజావాణిలో 122 సమస్యలపై ఫిర్యాదులు

జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యా నాయక్



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్ కలెక్టరేట్‌లో సోమవారం ప్రజావాణిలో ప్రజల నుంచి 122 సమస్యలపై జిల్లా రెవెన్యూ అధికారి లింగ్యానాయక్ ఫిర్యాదులు స్వీకరించారు. మండుటెండల్లో జిల్లాలోని సుదూర ప్రాంతాల నుంచి తరలిచ్చిన ప్రజలు తమ సమస్యలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు అందజేయడంపై సంబంధిత అధికారుల్లో చర్చనీయాంశమైంది. ఈ సందర్భంగా డీఆర్‌ఓ లింగ్యానాయక్ మాట్లాడుతూ తమ శాఖలకు చెందిన అర్జీలను సంబంధించి అధికారులు సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ఏవైనా ఫిర్యాదుల దరఖాస్తులు తిరస్కరించినట్లయితే వాటికి సంబంధించి సమాచారాన్ని వారికి ఇవ్వాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీపీవో మోహన్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఓ బూటకం

కాంగ్రెస్ నేత హరివర్ధన్‌రెడ్డి ఆరోపణ

సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రజావాణి కార్యక్రమాన్ని తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్న ప్రజావాణిలో కలెక్టర్, జిల్లా అడిషనల్ కలెక్టర్లు, ముఖ్యమైన జిల్లా అధికారులు పాల్గొనకపోవడం దురదృష్టకరమని టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కో ఆర్డినేటర్, కాంగ్రెస్ జెడ్పీ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆయన ప్రజావాణిలో ఫిర్యాదులు, దరఖాస్తులు చేసుకుంటున్న ప్రజలతో ఆయన ముచ్చటించారు. గత సంవత్సర కాలం నుంచి ప్రజలు అందజేసిన సుమారు 3,500 వినతుల్లో 20 శాతం కూడా పరిష్కారానికి నోచుకోలేదని ఆయన ఆరోపించారు. అధికారులు ధరణి సమస్యలపై దృష్టి పెట్టలేదని విమర్శించారు. అధికార పార్టీ నాయకులు భూకబ్జాలకు పాల్పడుతుంటే కళ్లు మూసుకుంటున్న అధికారులు పేదలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారన్నారు. ధరణి వల్ల ఎంతోమంది పేద రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని, దీన్ని అడ్డం పెట్టుకుని అధికారులు, అధికార పార్టీ నాయకులు దోపిడీకి తెర తీస్తున్నారన్నారు. కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు భీమిడి జైపాల్‌రెడ్డి, జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సింగ్ పాల్గొన్నారు.

